క్లుప్తంగా

విశ్వాసులు విధేయత కలిగి ఉండాలి



చీపురుగూడెంలోని ప్రేయర్ హౌస్‌లో ప్రసంగిస్తున్న దీనాకుమారి

నల్లజర్ల: ప్రతి విశ్వాసి విధేయత కలిగి ఉండాలని భీమవరం దీన దెబోరా మినిస్ట్రీస్ దైవ జనురాలు దీనాకుమారి అన్నారు. చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జ్యోజి అధ్యక్షతన మంగళవారం సంఘ క్షేమాభివృద్ధి కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా దీనాకుమారి మాట్లాడుతూ, భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే దేవుని దీవెనలు మెండుగా ఉంటాయన్నారు. సమాజంలో ప్రజలపై ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. విధేయతతో ప్రార్థించడం వల్ల విజయాలు లభిస్తారన్నారు. వేకువజామున చేసే ప్రార్థనలు సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఖండెల్లి రాజేష్‌కుమార్, మరపట్ల జాన్ మార్క్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నిడదవోలు: బాధిత కుటుంబాలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 23 మందికి మంజూరైన రూ.19.18 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన పశువులు కోల్పోయిన రైతులకు రూ.1.50 లక్షల చెక్కులు అందజేశారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



కోరుమామిడిలో ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ

నిడదవోలు రూరల్: ఉపాధిహామీ పథకంలో పనులు నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుమామిడిలో ఉపాధిహామీ పథకంలో నిర్మాణం చేపట్టిన పుంత రోడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఏపీఓ ఎ.సత్యనారాయణ, ఉపాధి హామీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల భవనానికి ఆర్థిక సాయం



జిల్లా అధ్యక్షుడు మూర్తికి చెక్కు అందిస్తున్న పెన్షనర్లు

నిడదవోలు: రాజమండ్రిలోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యాలయం నూతన భవన నిర్మాణానికి పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ సేకరించిన రూ.1.16 లక్షల చెక్కును జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు కె.మూర్తికి మంగళవారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు, గౌరవాధ్యక్షుడు నల్లి విశ్వామిత్ర, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, బొజ్జా పాపారావు, కె.కుమార్, పొన్న సుబ్రహ్మణ్యం, కె.సామ్రాజ్యం, ఖండవిల్లి రంగాచార్యులు, సింహాద్రి, వై.గంగరాజు, కొప్పుల వెంకటేశ్వరరావు, గంగుమళ్ల హనుమంతరావు, డి.గణేష్, బొజ్జా కొండబాబు, దేవిశెట్టి అమ్మన్నరాజా, హాజీ, పొన్న కృష్ణబాబు, ఎన్.నరసింహమూర్తి, ఎస్.శమంతకమణి, మృత్యుంజయరావు, ఎండీ షరీఫ్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గుట్కా.. మరణానికి చిట్కా

- దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- ఎక్కడా కానరాని నిషేధం
- చెడు వ్యసనాల వైపు మళ్లుతున్న యువత
- పట్టించుకోని అధికార యంత్రాంగం



చాగల్లులోని ఓ దుకాణంలో విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లు



దుకాణాల్లో అమ్ముతున్న నకిలీ సిగరెట్లు

చాగల్లు: రోజురోజుకూ అనేక మంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా 15 నుంచి 35 ఏళ్ల వారు మాదక ద్రవ్యాలతో చెడు వ్యసనాల బారిన పడుతున్నారు. గుట్కా, ఖైనీ, సిగరెట్, మద్యం వంటి హానికర, మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాల బారిన పడి నాశనమవుతున్నారు. వీరికి 40 నుంచి 50 ఏళ్లు వచ్చేసరికి ఆరోగ్యం పూర్తిగా పాడైపోతుంది. కాలక్షేపానికి కొందరు, వినోదానికి మరికొందరు వీటికి బానిసలై తమ జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారు.

గుట్కాలో టుబాకో, లైమ్, ప్రొపిన్, సింథటిక్ తదితర విషపూరిత రసాయనాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఖైనీ తినడం వల్ల పెదవులు పొక్కిపోయి, కొంతకాలానికి దంతాలు, చిగుళ్లు పూర్తిగా పాడవుతాయని హెచ్చరిస్తున్నారు. ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో కూడా ఖైనీ, గుట్కా అందుబాటులో ఉండటం వల్ల చిన్న వయసు వారు కూడా వీటికి ఆకర్షితులవుతున్నారు. వీటి అమ్మకాలపై నిషేధం ఉన్నా.. ఇవి మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. ఒడిశా, కోల్‌కతా వంటి ప్రాంతాల నుంచి రాజమండ్రి నగరానికి వీటిని కొంతమంది వ్యాపారులు అక్రమంగా రప్పిస్తున్నారు. అక్కడి నుంచి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్ దుకాణాలకు గుట్టుచప్పుడు కాకుండా రవాణా సాగిస్తున్నారు. వీటితో పాటు, అనుమతుల్లేని పలు రకాల సిగరెట్లు కూడా ఇబ్బడిముబ్బడిగా రవాణా అవుతున్నాయి. ఈ సిగరెట్ల ధర తక్కువగా ఉండటంతో చాలా మంది గ్రామీణ ప్రాంతాల్లో యువత వీటివైపు మొగ్గు చూపుతున్నారు. వీటిని దుకాణాల్లో విక్రయించరాదని నిబంధనలున్నా, దుకాణదారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ప్యాకెట్లకు సంబంధించి తయారీ కంపెనీ వివరాలు లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

జోరుగా విక్రయాలు

ఇలాఉండగా, నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో సంబంధిత అధికారుల వైఫల్యం వల్ల కొన్ని దుకాణాల్లో గుట్కా, ఖైనీ, నకిలీ సిగరెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటి అమ్మకాలపై రాబడి బాగుంటుందని ఆయా వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వీటి రవాణాతో పాటు, దుకాణాల్లో విక్రయాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రెట్టింపు ధరలు

అనేక మంది బానిసలుగా మారుతున్న నేపథ్యంలో గుట్కా, ఖైనీ ప్యాకెట్ల ధరలను వ్యాపారులు అమాంతం రెట్టింపు చేశారు. గతంలో ఓ ప్యాకెట్ ధర రూ.5 నుంచి రూ.10 వరకు ఉండేది. వీటిని రూ.10 నుంచి రూ.20 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని కొనుగోలు చేస్తున్నామని కొంతమంది యువకులు చెబుతున్నారంటే వీటికి ఎలా బానిసలయ్యారో అవగతమవుతోంది.

> **ప్రాణాలకే ప్రమాదం**
>
> పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం పూర్తిగా మానేయాలి. గుట్కాలు, ఖైనీలు, సిగరెట్ల వల్ల దంత క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. మనిషి ప్రాణానికే హానికరం.
>
> – డాక్టర్ నిశిత, వైద్యాధికారి, బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ, చాగల్లు మండలం

హెచ్ఐవీ నియంత్రణకు అవగాహన



కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న జయరాజు బృందం

నల్లజర్ల: సురక్షితం కాని శృంగారంతో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని యువత అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడేనికి చెందిన ఎం.జయరాజు బృందం కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనంతపల్లి సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో చైతన్యం రావాలని, హెచ్ఐవీకి నివారణ ఒక్కటే మార్గమని గుర్తించాలని ఈ బృంద సభ్యులు వివరించారు. హెచ్ఐవీ వైరస్ లైంగికంగా, ఇన్ఫెక్షన్ సోకిన సూదులతో రక్తం ఎక్కించడం ద్వారా, వ్యాధి సోకిన తల్లి ద్వారా బిడ్డకు వ్యాపిస్తుందన్నారు. ఈ వైరస్ శరీరంలో రోగ నిరోధక శక్తిని బలహీనపర్చి, క్రమంగా ఆరోగ్యం క్షీణిస్తుందని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫెసిలిటీ సెంటర్లు ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులకు మందులు అందించడంతో పాటు, హెపటైటిస్–బి, సీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

జేసీ చిన్నరాముడు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

తాళ్లపూడి(కొవ్వూరు): రైతుల నుంచి మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మద్దతు ధర కల్పించేలా కొనుగోళ్లు ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాకు నిర్దేశించిన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణలో అత్యంత ఉదారతతో వ్యవహరిస్తూ, 3.30 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ చేయాలని నిర్దేశించినట్టు వివరించారు. అందుకనుగుణంగా మండల పరిధిలో ధాన్యం కొనుగోలు జరుపుతున్నట్టు తెలిపారు. రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో విధిగా బి–రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యం వివరాలు ఏ–రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోళ్లు జరపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఆర్ఆర్ ప్రేమ్‌కుమార్, ఏఎస్‌వో ఎం.నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ దుర్గాప్రసాద్, కొవ్వూరు డివిజన్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు సుంకరవల్లి రమేష్, ప్రతినిధులు సూరపనేని శివరామకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



చంద్రవరంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

చాగల్లు: విద్యార్థులు వేసవి కాలంలో గ్రంథాలయాలను ఉపయోగించుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. చంద్రవరంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. ఎంతోమంది వ్యక్తులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి ప్రపంచ మేధావులయ్యారన్నారు. శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, కంప్యూటర్ నేర్పించడం, పాటలు, డ్రాయింగ్, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి సుమన్‌కుమార్ చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ఇస్తామని తెలిపారు. శిబిరంలో భాగంగా విద్యార్థులకు తెలుగు వ్యాకరణం బోధించినట్టు గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు తెలిపారు.

నిడదవోలు: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని తమ పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఇప్పటి వరకు తెలుసుకున్న పలు అంశాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులతో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు, కె.ప్రభాకరం తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ చిత్ర బృందం విజయోత్సవ యాత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో ఆ చిత్ర బృందం విజయోత్సవ యాత్ర నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరంలో ఆ సినిమా ప్రదర్శిస్తున్న అప్సర థియేటర్‌కు విచ్చేసింది. శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్, దర్శకుడు కార్తిక్ రాజా సందడి చేశారు. డప్పు వాయిద్యాల మధ్య గీత ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అప్సర థియేటర్ మేనేజర్ మధు తదితరులు స్వాగతం పలికారు. థియేటర్‌లోకి చిత్ర బృందం అడుగుపెట్టిన వెంటనే ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. ఈ నెల 9వ తేదీన విడుదలైన సింగిల్ సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని శ్రీవిష్ణు పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. వెన్నెల కిశోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో పలుసార్లు హీరో శ్రీవిష్ణు ప్రస్తావించడం నవ్వులు పోయించింది. అదే విషయాన్ని ప్రేక్షకులు గుర్తు చేసుకుంటూ గాయత్రి రాలేదా అంటూ ప్రశ్నించారు. కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

తీయని విషం

- మామిడి కాయలు పండించటానికి రసాయనాల వినియోగం
- అసహజ పద్ధతులు పాటిస్తున్న కొందరు వ్యాపారులు
- అవి తింటే అనారోగ్యాలు



మార్కెట్ కమిటీలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు (ఫైల్)



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

రాజమహేంద్రవరం రూరల్: మామిడి పండ్ల వ్యాపారం రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో జోరుగా సాగుతోంది. ఎండాకాలంలో నోరూరించే ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతారు. సీజన్ వారీగా దొరికే వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదు. సహజంగా ముగ్గిన పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. అయితే కొందరు వ్యాపారాలు రసాయనాలతో మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. ఎక్కువ లాభాలను ఆర్జించాలనే దురుద్దేశంతో వీరు చేసే పని వల్ల మధుర ఫలం విషతుల్యమవుతుంది. రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో కొన్నిచోట్ల కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఈ కృత్రిమ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లు పసుపు రంగులో నిగనిగలాడుతూ కనిపిస్తాయి. వీటిని కొనుగోలు చేసి తింటున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

విషతుల్యం

గతంలో పండ్లను సాధారణ పద్ధతుల్లో మగ్గబెట్టేవారు. జనాభా పెరుగుదల, పండ్ల వినియోగం పెరగడంతో కృత్రిమ పద్ధతులను పాటిస్తున్నారు. ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగం వల్ల జీర్ణకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మామిడి సహా నేడు మార్కెట్లో దొరికే అరటి తదితర పండ్లను కృత్రిమంగానే మగ్గబెడుతున్నారు. ఈ అనర్థాలపై ఆహార భద్రతా నియంత్రణ అధికారులు రైతులకు, వ్యాపారులకు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

నిగారింపు

రసాయనాల మగ్గబెట్టిన మామిడి పండ్లు 24 గంటల్లోనే పండిపోతుంది. చక్కని పసుపు రంగుతో నిగనిగలాడుతుంది. సాధారణంగా మామిడికాయలను చెట్టు పైనే పక్వానికి వచ్చే వరకు ఉంచితే సహజ సిద్ధంగా తీపిగా ఉంటాయి. కానీ వ్యాపారులు పక్వానికి రాకుండానే పచ్చి కాయలను తోటల నుంచి మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి కాయలను 18 నుంచి 24 గంటల్లో పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. అరటి, సపోటా, బొప్పాయి వంటి పండ్లను కూడా రసాయనాలతో మగ్గబెడుతున్నారు.

గుర్తించండి ఇలా..

- మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడానికి వ్యాపారులు ఎక్కువగా రసాయనాలను వినియోగిస్తున్నారు. కార్బైడ్, ఇథిలీన్‌తో మగ్గబెట్టిన పండ్లను గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.
- ఈ పండ్లు ఎక్కువ పసుపు వర్ణంలో ఉంటాయి. వీటిని తినేటప్పుడు నోటిలో కొంచెం మంట, కడుపులో నొప్పి, గొంతు నొప్పి మొదలవుతుంది.
- కృత్రిమంగా పండే పండ్లు పైకి పండినట్లు కనిపించినా లోపల రుచిలో తేడా ఉండి చప్పగా, పుల్లగా ఉంటాయి.
- సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన బట్టి వాటిని గుర్తించవచ్చు. కృత్రిమంగా పండిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు.
- పండ్లను తిన్న తర్వాత డయేరియా సమస్యకు గురైతే కాల్షియం కార్బైడ్, ఇథిలీన్ వాడినట్లు గుర్తించాలి.
- సహజ సిద్ధంగా మగ్గిన పండ్లపై ఆకుపచ్చ, పసుపు రంగు కనీకనిపించనట్టుగా ఉంటుంది. పండును కోసినప్పుడు లోపల గుజ్జు ఎరుపు, పసుపు రంగు కలిపినట్లు ఉంటుంది. ఈ పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> రసాయనాలు వాడి పండ్లకు మగ్గబెట్టడం వల్ల కలిగే అనర్థాలపై మామిడి రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే మార్కెట్ యార్డులో ఇద్దరు వ్యాపారుల నుంచి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. మగ్గబెట్టిన మామిడిపండ్లు అని తేలితే రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షల జరిమానాతో పాటు, వ్యాపారుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుంది.
>
> – వి.రుక్కయ్య, ఆహార భద్రతా నియంత్రణ అధికారి, రాజమహేంద్రవరం

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



సమిశ్రగూడెంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నిడదవోలు రూరల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన అజ్జు జట్టుకు, రన్నర్‌గా నిలిచిన సంతోషం జట్టుకు షీల్డులు, నగదు బహుమతులను గ్రామ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశాబత్తుల నాగప్రసాద్, వడల అంబేడ్కర్, బుగ్గే శివరామకృష్ణ, కాట్రు శాంతిరాజు, షేక్ రహీం, కిషోర్, ఆదర్శ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం అంబేడ్కర్ కళావేదిక వద్ద బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పుచ్చకాయల విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్ గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెయింట్ దేవదాసు అయ్యగారి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో ఉచిత వైద్యం, కేన్సర్ ముందు జాగ్రత్త పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రుల రాక

నిడదవోలు: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం తొలిసారి నిడదవోలుకు వచ్చారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వారికి స్వాగతం పలికారు. కోట సత్తెమ్మ అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి దుర్గేష్ వారికి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆయన మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. వెంకటేశ్వరనగర్‌లోని 1000 కేఎల్ కెపాసిటీ వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద హెడ్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించారు. వాటర్ పైపులైన్లలో గుర్తించిన లీకేజీలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం 19, 25 వార్డులలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ మాధవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.